# ఆరోగ్య ప్రదాత ఆది ధన్వంతరి

దర్శన భాగ్యంతో సర్వరోగ నివారణ కలిగించే శక్తి గల స్వామిగా కొలవబడుతున్న స్వామి శ్రీ ధన్వంతరి స్వామి. అంతటి శక్తి కలిగిన స్వామి ఆలయం ఆంధ్రప్రదేశ్‌లో ఏకైక ఆలయంగా ఎన్నికగన్నది. ఆరోగ్య ప్రదాత శ్రీ ధన్వంతరి ఆలయం తూర్పుగోదావరి జిల్లా, ఆలమూరు మండలం, చింతలూరు గ్రామంలో ఉంది. శ్రీ ధన్వంతరి స్వామివారి దర్శనం చేసుకుంటే చాలు రోగములు శాంతించునని శాస్త్రం ఘోషిస్తొంది. దేశ వ్యాప్తంగా పేరుగాంచిన వేంకటేశ్వర ఆయుర్వేద నిలయ పర్యవేక్షణలో నిత్య ధూప దీప నైవేద్యాదులతో ఈ స్వామి చింతలూరులో కొలువై ఉన్నారు. శ్రీమన్నారాయణని యేకవింశత్యవతారములలో పన్నెండవది శ్రీ ధన్వంతరి అవతారము. దేవ దానవులు అమృత సంపాదనకై క్షీర (పాలు) సాగరమును మధించు తరుణములో శంఖ చక్రౌషధసుధాకలశములు నాలుగు హస్తముల ధరించి పాలకడలి నుంచి బయలు వెడలిన విష్ణ్వంశ సంభూతుడు ధన్వంతరి. దుర్వాసుని శాపముతో రోగ భూయిష్ఠమైన స్వర్గలోకములో ఆయుర్వేద ప్రచారకుడై ఆరోగ్య ప్రదాతయై ఆరాధ్యదైవమయినాడు ఈస్వామి. అంతేకాదు ద్వితీయ ద్వాపర యుగమున భూలోకములో కాశీ రాజ్యాన్ని పరిపాలించిన చంద్రవంశపురాజు ధన్వనృపాలున కనుంగు పుత్రుడై జన్మించి, ధన్వంతరి నామంతో ఆయుర్వేదము నష్టాంగ సంగతముగా నొనర్చి సుశ్రుతాదుల కుపదేష్టయై చాలా కాలం రాజ్య పరిపాలన చేసి తిరిగి దైవత్వము పొందినట్లు పురాణం చెబుతుంది. ధన్వంతరిని ఆయుర్వేద రంగానికి ఆరాధ్య దైవంగా కొలుస్తారు. ఆయన కరుణా కటాక్షాలతోనే ఆయుర్వేద రంగం కొనసాగుతూందని పలువురు ఆయుర్వేద పండితుల విశ్వాసం. ధన్వంతరి స్వామి కరుణా కటాక్షముచే ఆయుర్వేద పండితుడు, వేంకటేశ్వర ఆయుర్వేద నిలయ వ్యవస్థాపకులైన "వైద్యరాజ" ద్విభాష్యం వేంకటేశ్వర్లు భక్తి ప్రపత్తులతో ధన్వంతరి స్వామి ఆలయాన్ని ఆలమూరు మండలం, చింతలూరు గ్రామంలో 1942లో ప్రతిష్ఠించి నిత్య ధూప దీప నైవేద్యాదులకు శాశ్వత భూవసతి కల్పించారు. వేంకటేశ్వర్లుగారి అనంతరం ఆయన ఏకైక కుమారుడు డాక్టర్ ద్విభాష్యం వెంకట సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఆలయ నిర్వహణ జరిగింది. వేంకటేశ్వర ఆయుర్వేద నిలయ ప్రస్తుత మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ద్విభాష్యం వెంకట శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ధన్వంతరి ఆలయాన్ని పునరుద్ధరణ చేశారు. రాష్ట్ర మొత్తం మీద ఏకైక ఆలయంగా కొలవబడుతున్న ధన్వంతరి ఆలయం రాజమండ్రికి 35 కిలో మీటర్ల దూరంలోను, రావులపాలెంనకు 15 కిలో మీటర్ల దూరంలోను కలదు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన చింతలూరు వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం సమీపంలోనే ఈ దేవాలయం కలదు. దర్శించి ఆరోగ్య భాగ్యాన్ని పొందండి!